కథ

# చెరపకురా

పాలడుగు వెంకటేశ్వరరావు

ఆ రాత్రంతా నిద్ర రాలేదు రాజారావుకి. కోపంతో,ద్వేషంతో రగిలిపోయాడు. ఆ కోపం భార్య మీద. ద్వేషం పక్కింటి పున్నారావు మీద. భార్య మీద రాజారావుకి కోపం రావటానికి కారణం వుంది. ఆ సాయంత్రం రాజారావు భార్య, అతన్ని శూలాల్లాంటి మాటలతో పొడిచి పొడిచి విడిచి పెట్టింది. బదులుగా ఆమెపై ఎదురుదాడి చెయ్యాలనుకున్నాడు. కాని ఆ పని అతని వల్ల కాలేదు.



'గిల్టీనెస్' అతని నోటిని పెగలనీయలేదు. పైగా ఆమె నోటి ధాటికి మహామహా వాళ్ళే నిలువలేరు. అటువంటిది రాజారావు ఒక లెక్క కాదు. పైగా ఈ 'గిల్టీనెస్' ఒకటి. ఈ మధ్య ఆమె దాష్టీకాలు ఎక్కువయ్యాయి.

చిన్నప్పటినుంచీ రాజారావుకి తన అందం మీద మక్కువ ఎక్కువ. ఫ్రెండ్స్ అతన్ని నాగేశ్వర్రావులా వుంటావురా! అనేవారు. గంటలకు గంటలు అద్దం ముందు నుంచుని అందానికి వన్నెలు దిద్దుకునేవాడు. ఒక్కగానొక్క కొడుకు కావటాన గారాబంగా పెరిగాడు. చదువు ఎట్లాగు ఒంటబట్టలేదు. బుద్ధిగా తిని ఇంటి దగ్గర కూర్చుంటే చాలు అనుకున్నారు తల్లిదండ్రులు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఇక చెప్పుకోవటానికి ఏముంది? మీసాలు, గడ్డాలు వచ్చే టైముకి రాజారావు లీలలు రకరకాలుగా రూపు దాల్చాయి. ఇంట్లోంచి డబ్బు పట్టుకెళ్ళి స్నేహితులతో బస్తీకి పోయి జల్సా చెయ్యటం, పేకాట ఆడటం, స్కూలు దగ్గరికిపోయి ఆడపిల్లల్ని అల్లరి పెట్టడం. అందిన చోటల్లా అప్పు చెయ్యటం- మొదలయిన విషయాలు తెలిసాయి. నయానాభయానా చెప్పి చూసినా దారికి వచ్చేలా కనిపించక పోయేసరికి రాజారావు తండ్రి రంగయ్య, తన పని తాను చేశాడు.

ఆ వూపులో సరిగ్గా తెలిసి చావక, పెళ్ళికి సరేనన్నందుకు, రాజారావు ఈనాటికీ భయపడుతూ బ్రతకాల్సి వస్తోంది. ఏ ముహూర్తాన రమణమ్మ మెడలో తాళి కట్టాడో గాని, ఆనాటి నుండి రాజారావు పని కుక్కిన పేను చందంగా అయ్యింది. స్వతహాగా రమణమ్మది దూకుడు స్వభావం. కాపురానికి వచ్చాక భర్త వ్యవహారం ఆకలింపు చేసుకున్నది, ఆరంభం నుంచి తన కంట్రోల్‌లో పెట్టుకుని, ఒక్క నొక్కు నొక్కి వుంచింది. స్వతంత్రం లేదు, స్వేచ్ఛ లేదు, గౌరవం, మన్నన అంతకన్నా లేదు. భార్య తన జీవితానికి కళ్ళెంలాగ తయారయ్యింది. పెళ్ళయిన మూడేళ్ళకే చకచకా పుట్టుకు వచ్చిన తన పిల్లలకు తనంటే ఏమంత ఇది లేదు. కన్న తల్లిదండ్రులకి కూడా కొడుకు కంటే కోడలుపైనే

**ఇది- రమణమ్మతో రాజారావుకి పెళ్ళికాక ముందు జరిగిన వ్యవహారం. దాంతో రగిలిన కసి వల్లనే- ఆ పెళ్ళికి సరేనన్నాడేమో అని రాజారావుకు అనుమానం. దేనికైనా తొందర తగదు. తనని అన్ని మాటలు అన్న ఆ ఆంజయ్య గాడికి, ఈ పున్నారావులో ఏం కనపడిందో మరి, బంగారం లాంటి అలివేణితో తన ఇంటిపక్కనే కాపురం పెట్టాలా? రమణమ్మతో నిత్య నరకం అనుభవిస్తూ, పక్కనే చిలకాగోరింకల్లా కాపురం చేస్తున్న వాళ్ళని రోజూ చూస్తూ భరించాలా?**

మమకారం. చెడిపోయిన కొడుకుని దారికి తెచ్చి ఆమె కుటుంబ గౌరవాన్ని నిలిపిందని అదొక ఇది. భార్య పైన ఎంత కోపమున్నా రాజారావు ఆమెను ఏమీ చెయ్యలేడు. పెట్టింది తిని, ఇచ్చింది కట్టుకుని, చెప్పింది చేయటమే ఇక తన పని! ఇదా జీవితం! ఎట్లా బ్రతికిన వాడు ఎట్లా అయిపోయాడు?

రాజారావుకి కోపం ఉప్పెనలా పొంగి వస్తుంది. కోపాన్ని వెన్నంటి, నీడ లాగ ద్వేషం పాకి వస్తుంది. ఆ ద్వేషం అటు తిరిగి ఇటు తిరిగి చివరికి పున్నారావు మీద వాలుతుంది. పున్నారావు మంచి మనిషని ఊర్లో బాగా పేరుంది. తనేమో తన పనేమో తప్ప ఇతర విషయాలు పట్టించుకునేవాడు కాదు. రాజారావు దృష్టిలో పున్నారావు పెద్ద అందగాడు కాదు. నలుపు రంగు, బక్క పలచగా వుంటాడు. రాజారావులా ఎరుపుకాదు. ఆజానుబాహువు అంతకన్నా కాదు. మరేమిటి పున్నారావు గొప్పదనం? బుర్ర బద్దలు కొట్టుకున్నా రాజారావుకి అర్థమై చావదు.

వయసులో వున్నప్పుడు ఎన్ని వెర్రి వేషాలు వేసినా రాజారావుకి ఆడపిల్ల అందాలని ఆరాధించే మనసుంది. పెద్ద పెద్ద కన్నులు, నల్లగా వంకీలు తిరిగిన జుట్టుని వయ్యారంగా అల్లిన వాలుజడా, అందాన్ని రంగరించిన నాజూకుదనం- ఇవన్నీ ఆ అమ్మాయి సొంతం. ఆమె పేరు అలివేణి. అలివేణికి మనసిచ్చిన రాజారావు- ఆ అమ్మాయిని తనకిచ్చి చెయ్యమని తల్లిని కోరాడు. ఆమె ముచ్చటపడి, ఆ సంగతి రంగయ్యకి చెప్పింది. పోనీలే పెళ్ళి చేస్తేనైనా దారిన పడతాడేమో కొడుకు అనుకుని అలివేణిని రాజారావుకిచ్చి పెళ్ళి చెయ్యమని అలివేణి తండ్రి అంజయ్యకి కబురు చేశాడు రంగయ్య. ఆ మాట విని అంతెత్తున ఎగిరిపడ్డాడు అంజయ్య, రంగయ్య మోతుబరితనాన్ని కూడా లెక్కచేయక.

"నా కంఠంలో ప్రాణం వుండగా నా కూతుర్ని ఆ చెడిపోయిన రాజారావుకి ఇచ్చి పెళ్ళి చెయ్యనుగాక చెయ్యను. వాళ్ళకి ఎంత ఆస్తి వుంటే ఏంటట? గుణం లేని వాడికి ఎన్ని ఉండి ఏమి ప్రయోజనం?" అంటూ ఏమేమో అన్నాడని తెలిసింది. చేసేదేం లేక ఊరుకున్నాడు రంగయ్య.

ఇది- రమణమ్మతో రాజారావుకి పెళ్ళికాక ముందు జరిగిన వ్యవహారం. దాంతో రగిలిన కసి వల్లనే- ఆ పెళ్ళికి సరేనన్నాడేమో అని రాజారావుకు అనుమానం. దేనికైనా తొందర తగదు. తనని అన్ని మాటలు అన్న ఆ ఆంజయ్య గాడికి, ఈ పున్నారావులో ఏం కనపడిందో మరి, బంగారం లాంటి అలివేణితో తన ఇంటిపక్కనే కాపురం పెట్టాలా? రమణమ్మతో నిత్య నరకం అనుభవిస్తూ, పక్కనే చిలకాగోరింకల్లా కాపురం చేస్తున్న వాళ్ళని రోజూ చూస్తూ భరించాలా? ఎంత ఘోరం? పున్నారావుగాడికి ఎంత పొగరు? ఎదురుపడినపుడు "ఏరా" అని పలకరించినా మాట్లాడడు. చిరునవ్వు నవ్వి తన దారిన తాను పోతాడు. మంచి చెడ్డా లేదు.

అలివేణి అంటే రాజారావుకి ఈనాటికి ఆపేక్షే. అందులో తప్పుందని అనుకోడు రాజారావు. ఆ కారణం చేతనే- ఆ రోజు సాయంత్రం అలివేణి అనుకోకుండా ఎదురుపడేసరికి పలకరించి కబుర్లు






చెప్పాడు రాజారావు. అమాయకంగా, సిగ్గుగా నిలబడింది అలివేణి. రాజారావు పెద్ద కొడుకు సి.ఐ.డి.గా పనిచేసి దానికి చిలువలు పలువలు కల్పించి, పేర్చి రమణమ్మకి చేరవేశాడు. ఆమె అగ్గి బరాటాలాగా మారి రాజారావుని ఉతికి ఆరేసింది. అందుకని ఆ రాత్రంతా నిద్ర రాలేదు రాజారావుకి కోపంతో, ద్వేషంతో రగిలిపోయాడు. కోపం భార్య రమణమ్మ మీద. కానీ ఆమెను ఏమీ చెయ్యలేడు. అందువలన ఆ కోపం పున్నారావు మీదకి మళ్ళింది, ఉరుములాగా.

కోడి కూసింది. రమణమ్మ గుర్రు పెట్టి నిద్రపోతోంది. వసారాలో పిల్లలు, ముసలోళ్లు గాఢ నిద్రలో వున్నారు. గేటు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు రాజారావు. కోపంగా వుంది. కసిగా వుంది. ఏదో చెయ్యాలని వుంది. ఏం చెయ్యాలి? పున్నారావు మీద పగ తీర్చుకోవాలి. ఎట్లా? అతని మీద తనకు ఎందుకు పగ? అతనేం చేశాడు? ఏమో తెలియదు. కాని పగ తీర్చుకోవాలి. ఎట్లా? పున్నారావు పొలం పనికి వెళ్ళే వేళ ఇది. వాడిని పట్టుకుని కర్రతో బాది బుర్రబద్దలు కొడితే? ఛస్తే, పెద్ద కేసవుతుంది. పోలీసులు, జైలు... వద్దులే. మరి ఎట్లా? పగ తీరేదెట్లా? పళ్ళ పటపట! మసక చీకట్లో పక్కింటి గేటు దగ్గర అలికిడయ్యింది. అడుగుల చప్పుడు. పున్నారావు గేటు తీసుకుని రోడ్డు పైకి వస్తున్నాడు. ఇదే మంచి సమయం. రాజారావు కిందికి వంగి, గులకరాయిని అందుకున్నాడు. చావడు గాని దెబ్బ గట్టిగానే తగులుతుంది. ప్రస్తుతానికి వాడికి ఈ శిక్ష చాలు.

పోలీసు పిచ్చయ్యకి ఆ రోజు ఆ వూళ్ళో డ్యూటీ పడింది. పట్నానికి అనుకుని వున్న ఆ వూళ్ళో ఈ మధ్య దొంగతనాలు జరుగుతున్నాయి. అందుకని కొన్నాళ్ళు రాత్రిపూట పోలీసు పహారా పెట్టమని ఆ వూరి ఎం.ఎల్.ఏ కోరగా ఆ ఏర్పాటు జరిగింది. ఇంకో ఐదు నిముషాల్లో డ్యూటీ దిగి వెళ్ళిపోతాడు పిచ్చయ్య. ఆ సమయంలో పిచ్చ కోపంగా వున్నాడు పోలీసు పిచ్చయ్య.

ఆ చీకట్లో బాణంలా దూసుకువచ్చి ఠాప్‌మని తగిలింది గులకరాయి. దెబ్బతిన్న పులిలా వెనుదిరిగి ఆ రాయి వచ్చిన దిక్కుకు లంఘించి, నక్కిన దోషిని బలంగా వొడిసి పట్టుకున్నాడు పిచ్చయ్య. పిచ్చయ్య ఇనుప పిడికిలి పట్టులో చిక్కి గిలగిలలాడాడు రాజారావు.

*



# కొవ్వొత్తుల్ని ఇలా వెలిగించండి

ఇప్పుడు మార్కెట్ నిండా రకరకాల రంగు రంగుల కొవ్వొత్తులు కనిపిస్తున్నాయి. క్యాండిల్ లైట్ విందులు ఏర్పాటు చేయాలనుకునేవారు కొవ్వొత్తులు ఎక్కువ సమయం వెలిగేలా చూసుకోవాలి. అందుకు పనికి వచ్చే కొన్ని చిట్కాలు మీకోసం...

* వెలిగించే ముందు కొద్దిసేపు కొవ్వొత్తులను ఫ్రిజ్‌లో పెట్టండి.
* వత్తి లావుగా వుంటే త్వరగా కరిగిపోతుంది. ఆరు మిల్లీమీటర్ల మందం మాత్రమే ఉండేలా చూసుకోండి.
* కొవ్వొత్తిని స్టాండ్‌పై అమర్చేటపుడు అడుగున కాస్త కరిగించి పోయడం మనకు అలవాటు. స్టాండు కాస్త ఇరుగ్గా ఉన్నా అందులో మనం పట్టించడానికి చేసే పని అది. ఈసారి అలా చేయకండి. సన్నగా బ్లేడుతో కొవ్వొత్తిని స్టాండుకు సరిపోయేలా కోయండి. ఒక వేళ కొవ్వొత్తి సన్నగా ఉండి స్టాండు కాస్త వెడల్పుగా ఉంటే కొవ్వొత్తికి అడుగున టిష్యూ పేపర్ చుట్టండి.
* స్టాండ్‌పై కరిగిపోయిన మైనాన్ని తీయాలంటే ముందుగా కాసేపు స్టాండ్‌ని ఫ్రిజ్‌లో వుంచండి. తేలిగ్గా వచ్చేస్తుంది.
* అలాగే తివాచి దుస్తుల మీద పడిన మైనం మీద ఐసుముక్క రుద్దితే మైనం గట్టిపడి తేలిగ్గా ఊడివస్తుంది.
* కొవ్వొత్తిని ఆర్పాలనుకున్నప్పుడు గబుక్కున ఊదేయకండి. వత్తినుంచి పొగ వాసన వస్తాయి. క్యాండిల్ స్నఫర్ వాడటం మంచిది.

-కె.యస్.పి.లక్ష్మి